క్లుప్తంగా

నాణ్యత లేకపోతే బిల్లులు ఆపేస్తాం..



బీటీ రోడ్డు నిర్మాణంలో నాణ్యత పరిశీలిస్తున్న డీఈఈ కేవీ ప్రసాదరావు

సాక్షి ఎఫెక్ట్...

రాజాం: స్థానిక పట్టణ రహదారి విస్తరణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తున్నామని ఆర్అండ్బీ డీఈఈ కేవీ ప్రసాదరావు అన్నారు. పట్టణ రోడ్డు పనుల్లో నాణ్యత పాటించని కారణంగా నాణ్యత డొల్ల శీర్షిక పేరిట ఈ నెల ఒకటో తేదీన సాక్షి దినపత్రికలో వార్తా కథనం ప్రచురితమైంది. ఈ మేరకు స్పందించిన డీఈఈ బీటీ రోడ్డు నిర్మాణం పరిశీలించారు. అలాగే పలుచోట్ల డివైడర్లు, పాత కల్వర్టులు చూసి వాటి నాణ్యతపై ఆరాతీశారు. నిర్మాణ పనులు సక్రమంగా చేయకుంటే(నాణ్యత లేకుంటే) బిల్లులు నిలుపుదల చేస్తామని సంబంధిత కాంట్రాక్టరును హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఈ నాగభూషణరావు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక తవ్వకాలపై ఫిర్యాదు



తహసీల్దారుకు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

బాడంగి: మండలంలోని గొల్లాది గ్రామం వద్ద ఉన్న వేగావతి నదిలో నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్నారని ఆ గ్రామస్తులు తహసీల్దారు కె.సుధాకర్‌కు మంగళవారం ఫిర్యాదు చేశారు. తమ గ్రామంతో పాటు గజరాయునివలస, కామన్నవలస గ్రామాలకు ఈ నది నుంచే రక్షిత మంచినీటి పథకాలు, వ్యవసాయ బోర్లకు నీరు సరఫరా అవుతోందన్నారు. తగిన ఇసుక నిల్వలు లేకపోతే బోర్లకు నీటి సరఫరా జరగదని తక్షణమే ఇసుక తవ్వకాలు అడ్డుకోవాలని కోరారు.

బొబ్బిలి: బాడంగి మండలం, గొల్లాది గ్రామ వేగావతి నది వద్ద జరుగుతున్న ఇసుక తవ్వకాలపై ఆ గ్రామ సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులంతా బొబ్బిలి ఆర్డీవోకు మంగళవారం ఫిర్యాదు చేశారు. భూగర్భ జలాల పరిరక్షణ జరగాలంటే ఇసుక తవ్వకాలను నిలుపుదల చేయాలని కోరారు.

'పొలం పిలుస్తోంది'



రైతులకు సూచనలిస్తున్న ఏవో రేణుకాసాయి

రాజాం సిటీ: పంటల సాగుకు సంబంధించి, అధికారుల సూచనలు పాటించడం ద్వారా రైతులకు ఎంతో మేలు చేకూరుతుందని వ్యవసాయాధికారి ఎం.రేణుకాసాయి అన్నారు. మండలంలోని రాజయ్యపేట రైతు సేవా కేంద్రంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. రసాయనిక ఎరువుల వినియోగం తగ్గించి, సేంద్రియ ఎరువులు బాగా వాడాలని, అలా అయితే ఆరోగ్యవంతమైన పంట, అధిక దిగుబడులు సాధ్యమన్నారు.

మాస్ కాపీయింగ్‌కు పాల్పడకుండా చర్యలు



పరీక్షలను పరిశీలిస్తున్న ఆర్డీవో రామ్మోహనరావు

బొబ్బిలి: స్థానిక పట్టణంలో ఆరు కేంద్రాల్లో జరుగుతున్న ఇంటర్మీడియట్ పరీక్షలను ఆర్డీవో జేవీవీఎస్ రామ్మోహనరావు మంగళవారం పరిశీలించారు. విద్యార్థులు మాస్ కాపీయింగ్‌కు పాల్పడకుండా చర్యలు తీసుకోవాలని, పరీక్షలు పక్కాగా జరపాలని సిబ్బందికి సూచించారు. అనంతరం ప్రశ్నపత్రాలు, పరీక్షకు హాజరైన విద్యార్థులు, విద్యార్థులకు కల్పిస్తున్న సదుపాయాలను ఆయన పరిశీలించారు.

ఫారంపాండ్‌ల నిర్మాణం



ఫారంపాండ్‌లు పరిశీలిస్తున్న ఏపీవో సత్యవతి

వంగర: ఉపాధి హామీ పథకం పనుల్లో భాగంగా ఫారంపాండ్‌ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని ఏపీవో మర్రాపు సత్యవతి అన్నారు. మండలంలోని వంగర, ఓనెఅగ్రహారం, మడ్డువలస తదితర గ్రామాల్లో ఉపాధి పనుల్లో చేపడుతున్న ఫారంపాండ్‌ల నిర్మాణాలను ఆమె మంగళవారం పరిశీలించారు. భూగర్భ జలాల సంరక్షణకు ఈ నిర్మాణాలు దోహదపడతాయని, తద్వారా తాగు, సాగు నీరు లభిస్తుందన్నారు.

- అధిక విద్యుత్ వినియోగదారులకు 'పీఎం సూర్య ఘర్'
- రూ.850 దాటి బిల్లు వచ్చిన వారికి ఆ భారం తగ్గేలా చర్యలు
- వెలుగు ఆధ్వర్యంలో గ్రామాల్లో లబ్ధిదారుల వివరాల సేకరణ
- నియోజకవర్గంలో 1,570 పథకం మంజూరు లక్ష్యం



పీఎం సూర్య ఘర్ యోజనపై అవగాహన కల్పిస్తున్న ఎడ్జి కంపెనీ అధికారులు(ఫైల్)

సూర్య ఘర్.. కరెంట్ చార్జీలకు చెక్!



పీఎం సూర్య ఘర్ యోజన కింద ఏర్పాటు చేసుకునే సోలార్ రూఫ్‌టాప్ పవర్ ప్లాంట్

రాజాం: అధిక విద్యుత్ వినియోగదారులకు ఉపయోగపడేలా కేంద్ర ప్రభుత్వం కొత్త పథకాన్ని తెరపైకి తీసుకొచ్చింది. రూ.850లు దాటి విద్యుత్ బిల్లులు వస్తున్న వారికి ఆ భారం తగ్గించేందుకు చర్యలు చేపడుతోంది. సెర్ప్ అనుసంధానంతో సోలార్ పవర్ జనరేషన్ ప్లాంట్లు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటోంది. ఈ మేరకు గ్రామాల్లో వెలుగు ఆధ్వర్యంలో సర్వే చేసి, లబ్ధిదారులను గుర్తించే ప్రక్రియ షురూ చేసింది.

గ్రామైక్య సంఘానికి 10 యూనిట్లు..

పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ పథకానికి సంబంధించి, సెర్ప్ సంస్థ రాజాం నియోజకవర్గంలో తొలివిడతలో 1570 యూనిట్లను అందించడం లక్ష్యంగా పెట్టుకుంది. ప్రతి మండలంలో గ్రామైక్య సంఘానికి 10 యూనిట్లు ఇచ్చేందుకు నిర్ణయించింది. ఆ సంఘ సభ్యుల్లో అత్యధికంగా విద్యుత్ వినియోగిస్తున్న వారి పేర్లను నమోదు చేస్తోంది. వారి ఇళ్ల వద్దనే సోలార్ ప్యానెల్(పవర్ ప్లాంట్లు) ఏర్పాటు చేయించి, దాని వల్ల కలిగే ప్రయోజనాలను వివరిస్తోంది.

10 శాతం పెట్టుబడి పెడితే చాలు..

గ్రామీణ ప్రాంతాల్లో నివశిస్తూ, అధికంగా విద్యుత్ వినియోగిస్తున్న వారికి రాయితీపై ఎడ్జిగ్రేడ్ కంపెనీ అనుబంధంతో పీఎం సూర్య ఘర్ పథకాన్ని మంజూరు చేస్తున్నారు. ఈ పథకం ద్వారా లబ్ధిదారుల ఇళ్లపై సోలార్ రూఫ్‌టాప్(ప్యానెల్) పవర్ ప్లాంట్‌లు ఏర్పాటు చేస్తున్నారు. కిలో వాట్ నుంచి 3 కిలోవాట్‌ల విద్యుత్ ఉత్పత్తి చేసే సోలార్ ప్యానెళ్లను సబ్సిడీపై అందిస్తున్నారు. రూ.70 వేల సోలార్ ప్లాంట్‌కు రూ.30 వేల రాయితీ, రూ.1.40 లక్షల ప్లాంట్‌కు రూ.60 వేల రాయితీ, రూ.1.95 లక్షల ప్లాంట్‌కు రూ.78 వేల రాయితీ అందిస్తున్నారు. లబ్ధిదారులు కేవలం 10 శాతం పెట్టుబడి పెడితే చాలు మిగిలిన పెట్టుబడి అంతా బ్యాంకులే అందించనున్నాయి. అన్నివర్గాల వారికి ఈ పథకం వర్తిస్తుండగా, ఈ ప్లాంట్‌ల ఏర్పాటుతో విద్యుత్ బిల్లులు చెల్లించేందుకు చెక్ పెట్టడమే కాకుండా, మిగిలిన విద్యుత్‌ను ప్రభుత్వానికి విక్రయించే అవకాశం కూడా ఉంది. విద్యుత్ కోతల సమస్యను అధిగమించేందుకు ఈ విధానం ఎంతగానో ఉపయోగపడుతుందని రాజాం ఎలక్ట్రికల్ ఏడీఈ బీవీఎస్ ఫణీంద్రకుమార్ తెలిపారు.

పీఎం సూర్య ఘర్ యోజన ఓ వరం..



పీఎం సూర్య ఘర్ యోజన పథకం అధిక విద్యుత్ వినియోగదారులకు ఓ వరం లాంటిది. విద్యుత్ ఖర్చు ఆదా అవుతుండడంతో పాటు మిగిలిన విద్యుత్‌ను ప్రభుత్వానికి విక్రయించుకునే అవకాశం కూడా ఉంది. అందరికీ ఈ పథకం వర్తిస్తుంది. వెలుగు సీసీలు, సీఎఫ్‌ల ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకుని, ఈ పథకం పొందవచ్చును.

– ఎ.చిరంజీవి, వెలుగు ఏసీ, రాజాం

కూటమి అభ్యర్థి ఓటమికి కూటమే కారణం..

- మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు



మాజీ ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి బలపరిచిన అభ్యర్థి రఘువర్మ ఓటమికి కారణం కూటమేనని మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు విమర్శించారు. ఇదే విషయమై ఆయన మంగళవారం సాయంత్రం విలేకరులతో మాట్లాడారు. కూటమి ఎమ్మెల్యేలు, మంత్రులంతా తమ అభ్యర్థిని గెలిపించాలని ప్రచారం చేశారని, తీరా వారు మద్దతు తెలిపిన అభ్యర్థి ఓడిపోయేసరికి మాటమార్చి అసలు ఆయన తమ అభ్యర్థి కాదని గెలిచిన అభ్యర్థే తమ అభ్యర్థి అని మాట్లాడుతుండడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వారి ఓటమి.. ప్రజాక్షేత్రంలో ప్రభుత్వం పట్ల ఉన్న ప్రజావ్యతిరేకతకు నిదర్శనమని దుయ్యబట్టారు. అలాగే సీఎం చంద్రబాబు ఇటీవల జరిగిన ఓ సమావేశంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలకు ఎటువంటి పనులు జరగకూడదని చెప్పడం ఏమిటని, ఆయనను ఏమనుకోవాలని ప్రశ్నించారు. 40 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగిన నాయకుడు, పలుమార్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన ఆయన.. ప్రస్తుతం సీఎం హోదాలో ఉండి కూడా ఇలా ఎవరైనా మాట్లాడతారా అని నిలదీశారు. ఆయన ప్రజలందరికీ ముఖ్యమంత్రి అనే విషయం మర్చిపోయి మాట్లాడడం సిగ్గుచేటన్నారు. ఒక వర్గాన్ని అభివృద్ధి, సంక్షేమాలకు దూరం చేయాలనుకోవడం చూస్తే ఆయన వ్యక్తిత్వం ఏంటో ఇట్టే తెలిసిపోతుందన్నారు. ఇప్పటికైనా ఇచ్చిన హామీలు అమలు చేసి, ప్రజల విశ్వాసం పొందాలని హితవు పలికారు.

ప్రభుత్వం పట్ల ప్రజావ్యతిరేకత తేటతెల్లం

- వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు చొక్కాపు లక్ష్మణరావు



మాట్లాడుతున్న పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు లక్ష్మణరావు

రామభద్రపురం: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలతో ప్రభుత్వం పట్ల ఉన్న ప్రజావ్యతిరేకత తేటతెల్లమైందని వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు, ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు విమర్శించారు. ఇదే విషయమై ఆయన స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం మీడియాతో మాట్లాడారు. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి పార్టీలన్నీ మొత్తం యంత్రాంగాన్ని మోహరించినా పాచిక పారలేదన్నారు. అధికార పార్టీ నాయకులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలతో బలాన్ని ప్రయోగించినా ప్రభుత్వ వ్యతిరేకతను టీచర్లు ఓటు రూపంలో వ్యక్తం చేశారన్నారు. దీంతో ఈ ప్రభుత్వం పట్ల ప్రజల్లో ఎంత వ్యతికేత ఉందో ఇట్టే అర్థమైపోతుందన్నారు. ఎన్నికల్లో అమలు సాధ్యం కాని హామీలిచ్చి ఓట్లేయించుకుని తీరా అధికారంలోకి వచ్చాక అన్ని వర్గాలను చంద్రబాబు సర్కారు మోసం చేసిందని ధ్వజమెత్తారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో కులం, మతం, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందజేశారని గుర్తు చేశారు. ప్రస్తుత సీఎం చంద్రబాబు మాత్రం వైఎస్సార్ సీపీ వాళ్లకు పనులు చేస్తే ఊరుకునేది లేదనడం సిగ్గుచేటన్నారు. ప్రభుత్వం అంటే ఒక్క టీడీపీ వాళ్లకే కాదని, రాష్ట్రంలోని ప్రజలందరిదీ అని అన్నారు. కార్యక్రమంలో మండల జేసీఎస్ కన్వీనర్ చింతల సింహాచలంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ ఏర్పాటుకు సహకరించండి



గ్రామస్తులతో చర్చిస్తున్న ఎంఈవో లక్ష్మణరావు

బొబ్బిలిరూరల్: మండలంలోని రంగారాయపురంలో మోడల్ స్కూల్ ఏర్పాటుకు సహకరించాలని ఎంఈవో చల్లా లక్ష్మణరావు కోరారు. ఇదే విషయమై ఆయన గ్రామంలో మంగళవారం పర్యటించి, అక్కడి ఎంపీపీ పాఠశాలలో మోడల్ స్కూల్ ఏర్పాటుకు అవసరమైన స్థల సేకరణ, ప్రస్తుత పాఠశాల విలీన విషయమై గ్రామస్తులతో చర్చించారు. గ్రామపెద్దలు, విద్యార్థుల తల్లిదండ్రులంతా తమకు సహకరించాలని కోరారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

రేగిడి: మండలంలోని చాటాయివలస, ముళ్లపాడు, ఉంగరాడ గ్రామాల్లోని రైతులకు ప్రకృతి వ్యవసాయంపై మంగళవారం అవగాహన కల్పించారు. ఏవో జి.మురళీకృష్ణ మాట్లాడుతూ తక్కువ పెట్టుబడితో ఆరోగ్యవంతమైన పంట, అధిక దిగుబడులు కావాలంటే ప్రతీ రైతు ప్రకృతి సేద్యాన్ని అవలంబించాలని కోరారు. రబీ సీజన్‌లో చోడి, వేరుశనగ, మొక్కజొన్న, పెసర తదితర పంటలను ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా సాగు చేస్తే మంచి ఫలితాలు ఉంటాయన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఏవో మురళీకృష్ణ

తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు

బాడంగి: రానున్న వేసవి దృష్ట్యా ఎక్కడా తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో ఎస్.రామకృష్ణ కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో విలేకరులతో మంగళవారం మాట్లాడిన ఆయన.. తాగునీటి కష్టాలు తెలిపేందుకు టోల్ ఫ్రీ నంబర్ 9110543087ను కేటాయిస్తున్నామని, ఎక్కడైనా తాగునీటి బోరు కానీ బావులు కానీ మరమ్మతులకు గురైతే వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు.

సమయపాలన పాటించండి

రాజాం: సమయపాలన పాటించాలని ఎంఈవో యాగాటి దుర్గారావు ఉపాధ్యాయులకు సూచించారు. స్థానిక పట్టణంలో పోలీస్‌స్టేషన్ రోడ్డులోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఆయన మంగళవారం తనిఖీ చేశారు. పాఠశాల తెరిచే సమయానికే ఆయన పాఠశాలకు విచ్చేసి ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరుశాతం తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థులకు కల్పిస్తున్న మౌలిక వసతులు, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు పరిశీలించారు.

గుర్ల గెడ్డ రిజర్వాయర్ పూర్తికి నిధులు కేటాయించండి

మెంటాడ: గుర్ల గెడ్డ రిజర్వాయర్ పూర్తికి నిధులు కేటాయించాలని కౌలురైతు సంఘం జిల్లా కార్యదర్శి రాకోటి రాములు డిమాండ్ చేశారు. ఇదే విషయమై మండల కేంద్రంలో మంగళవారం జరిగిన అఖిల పక్ష సమావేశంలో ఆయన కాసేపు ప్రసంగించారు. 1998లో అప్పట్లో ముఖ్యమంత్రిగా ఉన్న ప్రస్తుత సీఎం చంద్రబాబే గుర్ల గెడ్డ ప్రాజెక్టు నిర్మాణానికి శ్రీకారం చుట్టారని గుర్తు చేశారు. అప్పటి నుంచి ఆ నిర్మాణాన్ని అలానే వదిలేశారని, నిర్మాణాన్ని పూర్తి చేయాల్సిన బాధ్యత ప్రస్తుత కూటమి ప్రభుత్వంపై ఉన్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రాజెక్టు పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ చలుమూరి వెంకటరావు, వైఎస్సార్ సీపీ ఆర్గనైజింగ్ కార్యదర్శి రెడ్డిరాజు అప్పలనాయుడు, టీడీపీ నాయకుడు గొర్లె ముసలినాయుడు తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

రేగిడి: వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రేగిడి పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ సోహినీ రాఘవ్ సూచించారు. మండలంలోని వద్దాదిపేట, కేఎం వలస, చాటాయివలస, ఉప్పర్నానాయుడువలస, కందిశ గ్రామాల్లో టీబీ(క్షయ) వ్యాధిపై ప్రజలకు మంగళవారం అవగాహన కల్పించారు. దగ్గు, ఆయాసం ఎక్కువగా ఉంటే స్థానిక ఆశ వర్కర్‌కు తెలియజేయాలన్నారు. ఆ తర్వాత పీహెచ్‌సీకి సంబంధిత వ్యక్తి వస్తే తనిఖీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. అన్ని రకాల వ్యాధులకు రేగిడి పీహెచ్‌సీలో మందులు ఉన్నాయని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

కొలతల ప్రకారం పనిచేస్తే రోజుకు రూ.300

రేగిడి: నిర్దేశిత కొలతల ప్రకారం పనులు చేస్తే రోజుకు రూ.300 వేతనం గిట్టుబాటు అవుతుందని ఏపీవో ఎస్.హరనాథ్ అన్నారు. మండలంలోని అంబకండి, సోమరాజుపేట, ముళ్లపాడు, ఉంగరాడ గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను ఆయన మంగళవారం పరిశీలించి, పలు సూచనలు చేశారు. వేసవి ఎండల దృష్ట్యా వడదెబ్బ బారినపడకుండా ఉండేందుకు ఉదయం, సాయంత్రం వాతావరణం చల్లగా ఉన్న వేళల్లో పని చేసుకోవాలని సూచించారు. పని ప్రదేశంలో తాగునీరు, నీడ కోసం టెంట్లు, ప్రథమ చికిత్స కిట్‌ను అందుబాటులో ఉంచుకోవాలన్నారు.

శతశాతం ఉత్తీర్ణతకు కృషి చేయాలి

తెర్లాం: పదో తరగతి పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని మండల విద్యాశాఖాధికారి జె.త్రినాధరావు కోరారు. మండలంలోని పలు గ్రామాల్లోని పాఠశాలల్లో జరుగుతున్న ఎఫ్ఏ–4 పరీక్షలు, పదో తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులు, పాఠశాలలను ఆయన మంగళవారం తనిఖీ చేశారు. పదో తరగతిలో శతశాతం ఉత్తీర్ణతకు 100 రోజుల ప్రణాళికను పక్కాగా అమలు చేయాలన్నారు. విద్యార్థులకు ఏ సబ్జెక్ట్‌లోనైనా అనుమానాలు, సందేహాలు ఉంటే వాటిని వెంటనే నివృత్తి చేయాలన్నారు. విద్యార్థులను పరీక్షలకు అన్ని విధాలా సిద్ధం చేయాలన్నారు.

ఆడపిల్లల సంరక్షణ అందరి బాధ్యత

రాజాం సిటీ/వంగర/రేగిడి/తెర్లాం/బొబ్బిలిరూరల్: అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా భేటీ బచావో–భేటా పడావో కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. బాలల సంరక్షణ, బాల్యవివాహాల నిర్మూలన, బాలికా విద్య ఆవశ్యకతను ఐసీడీఎస్ అధికారులు వివరించారు. ఆడపిల్లల సంరక్షణ అందరి బాధ్యత అని, మహిళలను గౌరవించాలని, వారిని ఆర్థికంగా ఎదిగేందుకు ప్రోత్సహించాలని కోరారు. కొన్నిచోట్ల ఆరోగ్యమే లక్ష్యంగా మహిళలకు యోగాసనాలపై అవగాహన కల్పించారు. మరికొన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం వల్ల కలిగే ప్రయోజనాలు తెలిపారు.

వేసవి దుక్కు.. లాభాలు దక్కు..



పంటలకు మేలు చేసే వేసవి దుక్కులతో లాభాలు దక్కుతాయని వ్యవసాయ నిపుణులు సూచిస్తున్నారు. వేసవికాలంలో భూమిని దుక్కి చేయకుండా అలా వదిలేస్తే పంటలు సాగు చేసే సమయంలో కలుపు మొక్కల బెడద అధికంగా ఉంటుంది. ముఖ్యంగా కలుపుమొక్కలు నేలలోని నీరు, పోషక పదార్థాలు గ్రహించి పెరుగుతాయి. దీంతో భూసారం తగ్గిపోతుంది. అదే భూమిని దుక్కి చేసుకుంటే క్రిమికీటకాలు, శిలీంద్రాలు బయటకు వచ్చి, ఎండ తీవ్రతకు నశిస్తాయి. కొంచెం లోతుగా దుక్కి పనులు చేసుకుంటే పంటలకు చీడపీడల బెడద ఉండదు. ఈ నేపథ్యంలో రైతులంతా ప్రస్తుతం వేసవి దుక్కుల్లో నిమగ్నమయ్యారు. నాగళ్లతో దుక్కు చేస్తున్న రైతులను చిత్రంలో చూడొచ్చు. – రామభద్రపురం

ట్రాఫిక్ కష్టాలు తీరేదెప్పుడో..?



రామభద్రపురాన్ని ట్రాఫిక్ సమస్య నిత్యం వెంటాడుతోంది. ప్రధాన రోడ్డు ఇరుకు కావడం.. అదే రోడ్డులో భారీ వాహనాల రాకపోకలు జరుగుతుండడంతో తరచూ ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. ద్విచక్ర వాహనదారుడు కూడా ముందుకు కదలలేని దుస్థితి. ప్రతిరోజూ ఇదే సమస్య ఎదురవుతుండడంతో ప్రయాణికులు, పాదచారులు, వాహనదారులంతా.. ట్రాఫిక్ కష్టాలు తీరేదెప్పుడో అని వాపోతున్నారు. ఇప్పటికైనా పోలీసులను నియమించి, ట్రాఫిక్ జామ్ జరగకుండా చూడాలని విజ్ఞప్తి చేస్తున్నారు. – రామభద్రపురం

ప్రభుత్వం దృష్టికి నిర్వాసితుల సమస్యలు



మడ్డువలస ప్రాజెక్టు పరిధిలోని నిర్వాసితుల సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకువెళ్తామని ఆలిండియా బీసీ ప్రజా సంక్షేమ సంఘం అధ్యక్షుడు గూడురి వెంకటేశ్వరరావు అన్నారు. ప్రాజెక్టు పరిధిలోని పటువర్ధనం గ్రామంలో మంగళవారం పర్యటించిన ఆయన.. అక్కడి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రాజెక్టు కోసం సర్వం కోల్పోయామని, తమ విలువైన పంట భూములు ఇచ్చామని వారు తెలిపారు. అలాంటి తమకు కనీస వసతులు కల్పించకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ప్రాజెక్టును సందర్శించారు. – వంగర

ధర్నా



రాజాం సిటీ: ధర్నా చేస్తున్న ఆశ కార్యకర్తలు



బొబ్బిలి: డిమాండ్‌లు పరిష్కరించాలని కోరుతున్న ఆశ కార్యకర్తలు



బాడంగి: ఆశ కార్యకర్తల ధర్నా

రాజాం సిటీ: తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆశ కార్యకర్తలు ధర్నాకు దిగారు. స్థానిక ఆదర్శనగర్ యూపీహెచ్‌సీ వద్ద మంగళవారం జరిగిన ఈ కార్యక్రమంలో ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని కోరారు. అనంతరం ఆయా డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని వైద్యాధికారి కిరణ్‌కుమార్‌కు అందజేశారు. కార్యక్రమంలో ఆశ వర్కర్ల యూనియన్ గౌరవాధ్యక్షులు సీహెచ్ రామ్మూర్తినాయుడు, యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు సూర్యమణి, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి: ఆశ కార్యకర్తల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఈ నెల 6వ తేదీన చేపట్టబోయే చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పొట్నూరు శంకరరావు కోరారు. స్థానిక ఆయుర్వేద ఆస్పత్రి వద్ద ఆశ కార్యకర్తలు చేపట్టిన ధర్నాకు హాజరై వారికి మద్దతుగా నిలిచి ఆయన మాట్లాడారు. పెరిగిన ధరలకు అనుగుణంగా జీతభత్యాలు ఉండేలా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. గత ప్రభుత్వం ఇచ్చిన హామీలకు సంబంధించి, జీవోను విడుదల చేయాలన్నారు. రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ ఇచ్చి, పనిభారం తగ్గించాలన్నారు. రూ.10 లక్షల ఇన్సూరెన్స్ సదుపాయం కల్పించాలన్నారు.

బాడంగి: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మండలంలోని వాడాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ఆశ కార్యకర్తలు ధర్నా చేశారు.

సక్రమంగా సర్వేలు చేపట్టాలి



రాజాం సిటీ: శ్యాంపురంలో సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీవో శ్రీనివాసరావు



రేగిడి: తహసీల్దారుకు వినతిపత్రం అందిస్తున్న అంబకండి గ్రామ రైతులు

రాజాం సిటీ: సచివాలయ సిబ్బంది గ్రామాల్లో చేపడుతున్న సర్వేలు సక్రమంగా చేపట్టాలని ఎంపీడీవో వి.శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని శ్యాంపురంలో సచివాలయ సిబ్బంది చేపడుతున్న 18 నుంచి 50 ఏళ్ల యువత వర్క్ ఫ్రమ్ హోమ్ సర్వేను ఆయన మంగళవారం పరిశీలించారు. అంతకుముందు సచివాలయ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఎంఎస్ఎంఈ సర్వే, హౌస్ హోల్డ్ జియో సర్వే, మిస్సింగ్ సిటిజన్ డేటా ఎంట్రీ, పీఎసీఎస్ ఈకేవైసీ, చైల్డ్ ఆధార్ నమోదు తదితర సర్వేల ప్రగతిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.

రేగిడి: భూముల రీసర్వే సక్రమంగా నిర్వహించాలని అంబకండి గ్రామానికి చెందిన రైతులు కోరుతున్నారు. ఇదే విషయమై తహసీల్దారు ఎస్.చిన్నారావుకు గ్రామంలో మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఆరు సర్వే బృందాల ద్వారా భూములను సమగ్రంగా సర్వే చేయడం జరుగుతోందని, రైతులకు ఇబ్బందులు లేకుండా సర్వే చేస్తామని తహసీల్దారు తెలిపారు.